సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



సబ్‌స్టేషన్ కోసం పేదల ఇళ్లు కూల్చివేత
మృత్యుంజయకుంటలో 30 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను కూలగొట్టిన అధికారులు.. ఆ స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి చదును చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. - 8లో



ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు
ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న క్రికెట్ బెట్టింగ్ ముఠాను ప్రొద్దుటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. యాప్‌ల ద్వారా బెట్టింగ్ కొనసాగిస్తున్న ముఠా కార్యకలాపాల గుట్టు రట్టు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
38.6 /24.4

వాతావరణం
జిల్లాలో బుధవారం 24.4 – 38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రాష్ట్ర కమిటీ ఎన్నిక

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప హోటల్ హరితలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి ఎన్నికల అధికారులుగా మహానందయ్య, శౌరీలురెడ్డి వ్యవహరించారు. ఇందులో ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పి. జయరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పి. పెద్దిరాజు, ఉపాధ్యక్షులుగా ముగ్గురు, సంయుక్త కార్యదర్శిగా ముగ్గురు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ 9 మంది, సలహాదారులుగా ముగ్గురు, రీజినల్ కోఆర్డినేటర్లుగా నలుగురు, టెక్నికల్ కోఆర్డినేటర్ ఒకరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌టీసీ) కోసం ఐటీఐ పరీక్షను ప్రైవేటు అభ్యర్థులు రాసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు ఇదివరకే ఏదో ఒక ట్రేడ్‌లో ఐటీఐ పాస్ అయి మరోక ట్రేడ్ పరీక్షను రాయాలనుకున్న వారు కనీసం ఒక ఏడాది గుర్తించబడిన సంస్థలో సంబంధిత అనుభవం కలిగి ఉండాలన్నారు. వివరాలకు దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించడంతో పాటు అదే ఐటీఐలో దరఖాస్తును అందజేయొచ్చన్నారు. ఏప్రిల్ 12 లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

23వరకు తరగతులు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్ అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి అన్ని జూనియర్ కళాశాలలలో ఈ నెల 23 వరకు సెకెండియర్ విద్యార్థులకు తరగతులను నిర్వహించాలని ఇంటర్మీడియట్ ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులుగా ఇంటర్ విద్యా మండలి నిర్ణయించిందన్నారు. అలాగే ప్రథమ సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు నిర్వహించాలని వారికి బ్రిడ్జి కోర్సు సిలబస్ మేరకు తరగతులు నిర్వంచాలని తెలిపారు.

కుందన్ దోస.. రైతుకు నిరాశ!

- నష్టాలతో కుదేలైన దోస రైతు
- పెట్టుబడులు సైతం రాని పరిస్థితి

అట్లూరు : పంట ఏదైనా రైతు కంట కన్నీరే మిగులుతోంది. ఆరుగాలం కష్టపడి సాగు చేసినా నష్టమే పలకరిస్తోంది. తాజాగా దోస సాగులోనూ రైతులకు నిరాశే మిగిలింది. సంప్రదాయ పంటలతో నష్టాలొస్తున్నాయని స్వల్పకాలిక పంటలైన తీగ జాతి దోస సాగు వైపు రైతులు అడుగేశారు. ఇందులోనూ కుందన్ రకం దోసను సాగు చేశారు. ఖర్చుతో కూడుకున్నదయినా లాభాలు వస్తాయన్న ఆశతో సాగు చేశారు. పైరు బాగా ఏపుగా పెరిగింది. ఆశించిన మేర దిగుబడి కూడా ఉంది. తీరా కాయలు కోత దశకు వచ్చే సరికి ధర కుప్పకూలింది. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధర లేక పోవడంతో తోటలోనే వదిలేసిన కాయలు



మార్కెట్ వసతి లేక తోటలోనే కుప్పలుగా దోసకాయలు

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి

కుందన్ రకం దోస సాగుకు పెట్టుబడి ఎక్కువయినా రైతులు వెనుకంజ వేయలేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 700 హెక్టార్లకు పైగా ఈ కుందన్ రకం దోస సాగు చేశారు. సేద్యం మొదలుకుని మల్చింగ్‌తో పాటు విత్తనం, క్రిమి కీటకాల నివారణ కోసం పిచికారీ మందులు, డ్రిప్ ..ఎరువులు.. కూలీలు.. ఇలా మొత్తం ఎకరాకు లక్ష రూపాయల వరకూ ఖర్చు వస్తుంది. ఎకరాకు 10 టన్నులు దిగుబడి వచ్చే ఈ సాగుకు మంచి ధర ఉంటే ఖర్చులు పోను ఎకరాకు లక్ష నుంచి రెండు లక్షలు రూపాయలు ఆదాయం వస్తుంది.

పడిపోయిన ధరలు

జనవరి, ఫిబ్రవరి నెలతో పాటు మార్చి 20 వరకూ టన్ను 20 నుంచి 30 వేల వరకూ ధర పలికింది. ఆ తర్వాత ఒక్కసారిగా టన్ను ధర 6 వేల నుంచి 8 వేలకు పడిపోయింది. ఇప్పటికీ ఇవే ధరలు పలుకుతుండడంతో దోస రైతులు దిగాలు పడుతున్నారు. పెట్టుబడులు కూడా చేతికి రావని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మార్కెటింగ్ సౌకర్యంలేక అవస్థలు

అసలే పచ్చి సరుకు కోతకు వచ్చిన తరువాత రెండు రోజుల్లోనే విక్రయించుకోవాలి. లేకుంటే దోస రైతుల పరిస్థితి వర్ణణాతీతం అవుతుంది. అనంతపురం జిల్లాలో దోస సాగు విస్తారంగా చేశారు. అక్కడ రైతులకు బెంగుళూరుతో పాటు హైదరాబాదు మార్కెట్ దగ్గరలో ఉంటుంది. దీంతో అక్కడ రైతులకు రవాణా ఖర్చు చాలా తక్కువగా ఉంటుంది. దీంతో వ్యాపారస్థులు అనంతపురం జిల్లాలో కొనుగోలు చేసి మార్కెట్లకు తరలిస్తున్నారు. అదే కడప జిల్లాలో మార్కెట్‌లేక పోవడంతో ఇక్కడ నుంచి రవాణా ఖర్చులు అధికం అవుతుండడంతో వ్యాపారస్తులు అనంతపురం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పండిన కాయలు కనీసం కొనేందుకు కూడా ముందుకు రావట్లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని అన్ని పంటలకు గిట్టు భాటు ధర కల్పించినట్లు దోస పంటకు కూడా గిట్టు ధర కల్పించడమో..లేక రైతులు స్వయంగా అమ్ముకునేలా మార్కెట్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోలుకోలేని నష్టం



మార్కెట్లో మంచి ధర ఉంటుందని 12 ఎకరాల్లో కుందన్ రకం దోస పంట సాగు చేశాను. పైరు బాగా ఏపుగా పెరిగింది. సుమారు 12 లక్షల రూపాయలకు పైగా ఖర్చు వచ్చింది. వంద టన్నులకు పైగా దిగుబడి వచ్చింది. 70 శాతం కాయలు మార్కెట్ చేసుకోలేక తోటలోనే కుళ్లి పోయాయి. సగం పెట్టుబడి కూడా చేతికి రాలేదు. మాలాంటి నష్టపోయిన దోస రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– ముదమాల చంద్రశేఖర్‌రెడ్డి, దోస రైతు, వేమలూరు, అట్లూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను ఐదెకరాల్లో కుందన్ రకం దోస సాగు చేశాను. తీగలు బాగా సాగి కాయలు బాగా కాశాయి. మరో వారం పది రోజుల్లో కోతకు వస్తాయనుకుంటున్న సమయంలో మార్కెట్‌లో టన్ను ధర రూ.22 వేలు పలికింది. తీరా కాయలు కోతకు వచ్చే సరికి రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయింది. ఆ ధరకైనా వ్యాపారస్తులు ముందుకు రాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.
– రాజోలు సుబ్బారెడ్డి, దోస రైతు, అట్లూరు మండలం

అధికంగా సాగు చేయడంతోనే..



గతంలో దోస పంట చాలా తక్కువ మంది రైతులు సాగు చేసే వారు. దీంతో మార్కెట్లో ధర భాగా ఉండేది. ఈఏడాది వర్షాలు లేటుగా కురిశాయి. దీంతో రైతులు అంతా ఒకే అదునులో సాగు చేశారు. కాయలు మంచి దిగుబడి రావడంతో మార్కెట్లో ధర తగ్గింది. అందులో మనకు మార్కెట్ అందుబాటులో లేదు. అలాగే వ్యాపారస్తులను నమ్ముకోకుండా రైతులు స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకునే విధంగా ఎదగాలి.
– జయభరత్‌రెడ్డి, ఉద్యానవన అధికారి, బద్వేలు

రేపు పెన్షన్ అదాలత్

కడప కల్చరల్ : కడప ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 ఎస్.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పెన్షనర్లు, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశం కల్పించినట్లు వివరించారు. ఏప్రిల్ నెలకుగాను వేటెక్స్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న మూడు నెలల్లో పెన్షనర్లు కానున్న వారు ఈపీఎస్ 1995 సభ్యులు కూడా తమ ఫిర్యాదులతో ఈ పెన్షన్ అదాలత్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

రైల్వే రిజర్వేషన్ పాత వేళల పునరుద్ధరణ

కడప సెవెన్‌రోడ్స్/కోటిరెడ్డిసర్కిల్: రైల్వే టికెట్ల రిజరేషన్ల కోసం పాత సమయాలనే పునరుద్ధరించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ స్పందించారు. పాత వేళలను పునరుద్ధరిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఆర్ఎస్ కౌంటర్ సమయాలు రెండు షిఫ్ట్‌లుగా అంటే ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకూ ఇటీవల మార్చారు. దీనిపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రైల్వే జీఎంకు లేఖ రాశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రెండు కౌంటర్ల పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. దీనిపై స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ పాత సమయాలను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఎంపీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ ఉన్నతాధికారులు లేఖ పంపారు. ఈ విషయంపై బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజామొహిద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లంతా ఎంపీకి అభినందనలు తెలిపారు.

టీడీపీ నేతలది రాక్షసానందం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : అన్యాయంగా, అక్రమంగా ప్రవర్తించిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు దోషులుగా నిలబెడతామని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి హెచ్చరించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషాను ఇటీవల అరెస్ట్ చేసిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి బుధవారం ఆయన అంజద్‌బాషా కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే మాధవి రాక్షసానందం పొందడంలో భాగంగానే ఈ అరెస్ట్ జరిగిందన్నారు. అది 2022లో పెట్టిన చిన్నకేసు అని, అందులో ఉన్న బెయిలబుల్ సెక్షన్లను ఇప్పుడు నాన్‌బెయిలబుల్ సెక్షన్లుగా మార్చి అరెస్ట్ చేయడం అన్యాయమని ధ్వజమెత్తారు. ఎవరైతే కేసు పెట్టారో వారు తమ పార్టీలోనే ఉన్నారని, తాము రాజీ అవుతున్నట్లు కోర్టులో పిటిషన్ కూడా వేశారన్నారు. ఆ కేసులో పోలీసులు అత్యుత్సాహంతో లక్షలు ఖర్చుపెట్టి ముంబైకి వెళ్లి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ముంబైకి వెళ్లి అరెస్ట్ చేసేంత పెద్ద కేసా ఇది...ప్రజలంతా ఆలోచించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 10 నెలల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను విపరీతంగా వేధిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన హోటళ్లు, ఆఫీసులు, వాటర్‌ప్లాంట్లను కూల్చివేస్తున్నారన్నారు. జిల్లా అభివృద్ధిపై చర్చించాల్సిన డీఆర్‌సీ మీటింగ్‌లో వీటిపైనే చర్చ చేస్తూ తర్వాతి మీటింగ్‌లో యాక్షన్ టేకెన్ రిపోర్టు అంటూ మొదటి అంశంగా దానిపైనే కలెక్టర్, ఎస్పీలు చర్చిస్తున్నారంటే ఎంత అప్రజాస్వామికంగా పాలన నడుస్తోందో తెలుస్తోందన్నారు. పోలీసులు ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్నారో, టీడీపీ కార్యాలయం నుంచి అందుకుంటున్నారో ఆలోచించాలన్నారు. అహ్మద్‌బాషాను అన్యాయంగా అరెస్ట్ చేస్తే 30యాక్టు అమల్లో ఉన్నా లెక్కచేయకుండా టీడీపీ నాయకులు పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకోవడం వారి రాక్షసానందానికి పరాకాష్ట అని మండిపడ్డారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకోవడానికి వాళ్లేమైనా రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెచ్చారా ...లేక.. కడపకు ఉక్కు పరిశ్రమ తెచ్చారా అని ఎద్దేవా చేశారు. 30 యాక్టును ఉల్లంఘించి బాణాసంచా పేల్చారని వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కట్టలేదని, కనీసం రశీదు కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించే విషయంలో, టీడీపీ నాయకుల అక్రమ వ్యాపారాలను చక్కబెట్టే పనిలో ఎస్ఐలు, సీఐలు చాలా బిజీగా ఉన్నారన్నారు. బుద్ధి ఉన్నవారు ఎవ్వరూ మేయర్ ఇంటి వద్ద చెత్త వేయరని, మేయర్ సురేష్ ఎలాంటి వ్యక్తో ఎమ్మెల్యే మాధవి చెప్పక్కర్లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- 8 మంది ఎస్ఐలు, నలుగురు సీఐలు, 15 మంది కానిస్టేబుళ్లు ముంబైకి వెళ్లి ఒక తీవ్రవాదిని అరెస్ట్ చేసినట్లు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషాను అరెస్ట్ చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతి పరులపై లేనిపోని కేసులు, దొంగకేసులు, ఎస్సీ,ఎస్టీ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. పోలీసులు, అధికారులు ఈ ప్రభుత్వాన్ని నమ్మి అత్యుత్సాహం ప్రదర్శిస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు.
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తూ టీడీపీ నేతలు రాక్షసానందం పొందుతున్నారని మేయర్ సురేష్ బాబు మండిపడ్డారు. ఈ చర్యకు పాల్పడ్డ వారు ఇంతకు ఇంత అనుభవిస్తారని హెచ్చరించారు.
- టీడీపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడానికేనా ప్రజలు మీకు అధికారమిచ్చింది అని ప్రశ్నించారు. తమకు పరువుకు నష్టం కలిగేలా ప్రవర్తించిన ప్రతి ఒక్కరిపై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఎన్నికేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, సుభాన్‌బాషా, బీహెచ్ ఇలియాస్, యానాదయ్య, సీహెచ్ వినోద్, దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.



అంజద్‌బాషా ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఘనంగా బిషప్ పట్టాభిషేకం

- తరలివచ్చిన విశ్వాసులు
- పెద్ద ఎత్తున విచ్చేసిన పలు పీఠాల బిషప్‌లు, గురువులు
- భారీ వేదికపై సంప్రదాయంగా ప్రమాణ స్వీకారం





బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ పట్టాభిషేక కార్యక్రమంలో వేదికపై బిషప్‌లు, గురువులు (ఇన్‌సెట్) నూతన బిషప్

కడప కల్చరల్ : కడప కథోలిక మేత్రాసనానికి కొత్త కళ వచ్చింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న నూతన బిషప్ పట్టాభిషేకం ప్రభువు దీవెనలు, ఆత్మీయుల అభినందనల మధ్య ఘనంగా సాగింది. ఇంతవరకు బిషప్‌గా సేవలు అందించిన రెవరెండ్ గాలిబాలి ఆధ్వర్యంలో కడప కథోలిక పీఠం నూతన బిషప్‌గా మోస్ట్ రెవరెండ్ సగినాల పాల్‌ప్రకాశ్ పట్టాభిషిక్తులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తనను ఇంతగా ప్రేమించి సహకరిస్తున్న విశ్వాసులు, గురువులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కడప కథోలిక మేత్రాసన బిషప్‌గా మోస్ట్ రెవరెండ్ సగినాల పాల్ ప్రకాశ్ బుధవారం మరియాపురంలో ఏర్పాటు చేసిన భారీ ప్రత్యేక వేదికపై పట్టాభిషిక్తులయ్యారు. మరియాపురం బాలుర హైస్కూల్లో జరిగిన ఈ కార్యక్రమానికి సమీప ప్రాంతాల నుంచే కాకుండా ఇతర దూర ప్రాంతాల నుంచి కూడా గురువులు, విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.గురువులు ప్రత్యేకంగా రూపొందించి అలంకరించిన రథాలలో వాహనాలలో విశ్వాసులతో కలిసి ఊరేగింపుగా వేదిక వద్దకు వచ్చారు. బిషప్ పట్టాభిషేక ప్రాంగణానికి చేరుకోగానే విశ్వాసులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేస్తూ హల్లెలూయా నినాదాలతో ఆ ప్రాంతాన్ని ప్రతిధ్వనింపజేశారు. తొలుత ప్రత్యేకంగా విచ్చేసిన పోప్ దూత లియోపోల్డ్ జెరిల్లి నూతన బిషప్‌కు అభినందనలు తెలుపుతూ ప్రసంగించారు. అలాగే ఇంతవరకు బిషప్‌గా సేవలు అందించిన మోస్ట్ రెవరెండ్ గాలిబాలి ప్రసంగించారు. అనంతరం గురువులందరూ మోస్ట్ రెవరెండ్ సగినాల పాల్ ప్రకాశ్‌తో పట్టాభిషేక సంప్రదాయాలను ఆచరింపజేశారు. విశ్వాసులందరికీ దివ్ సత్ప్రసాదం అందజేశారు. కోయర్ బృందాలు నూతన బిషప్‌నుద్దేశిస్తూ గీతాలు ఆలపించారు.

నూతన బిషప్ స్పందన
తనను బిషప్‌గా దీవించిన దైవానికి, అభిమానించిన పోప్‌దూతకు, ఇంతవరకు సేవలు అందించిన గురువులు గాలిబాలికి నూతన బిషప్ కృతజ్ఞతలు తెలిపారు. పోప్ దూత మార్గదర్శనం చేసిన విధంగా ఈ ప్రాంతంలోని యువత, మహిళల ఉన్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పట్టాభిషేకం కాగానే గురువులు, విశ్వాసులు ఆయనను అభినందించారు.

పోప్ దూతలను కలిసిన ఎంపీ

కడప కార్పొరేషన్ : కథోలిక డయాసిస్ బిషప్‌గా సగినాల పాల్ ప్రకాష్ పట్టాభిషేక మహోత్సావాన్ని పురస్కరించుకొని వాటికన్ సిటీ నుంచి కడప నగరానికి విచ్చేసిన అంతర్జాతీయ కథోళిక ప్రతినిధి, పోప్ దూత పూల ఆంతోని, ఇండియా కథోలిక దూత నున్‌సియో లను కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి కలిశారు. బుధవారం పోప్ దూతలుగా జిల్లాకు విచ్చేసిన వారిని ఆయన కడప విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారు అవినాష్‌రెడ్డిని ఆశీస్సులు అందజేశారు. అనంతరం నూతన బిషప్‌గా పట్టాభిషిక్తులైన సగినాల పాల్ ప్రకాష్‌కు అవినాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



అంజనీసుతపై కౌసల్యతనయ

- హనుమంతవాహనంపై రామయ్య విహారం
- తిలకించి..పులకించిన భక్తజనం

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలో వెలసిన కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం రాత్రి 7 నుంచి 8:30 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండడగా, మంగ వాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా జరిగింది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రామయ్య నవనీతకృష్ణాలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

నేటి అలంకారాలు: బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మోహినీ అలంకారంలో స్వామి వారు భక్తులకు అభయమిస్తారు. రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు గరుడసేవ నిర్వహిస్తారు.

శ్రీరాముడిని రోల్‌మాదల్‌గా తీసుకోవాలి
ఒంటిమిట్ట : శ్రీరాముడిని రోల్‌మాడల్‌గా తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒంటిమిట్ట రామయ్యను ఎంపీలు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వీరికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అలయ ప్రదక్షణ గావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ రంగ మండపంలో వీరికి అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం కడప ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రం బాగుండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.శ్రీరాముడు రాజుగా సుభిక్ష మైన పాలన అందిచాడని చెప్పారు.



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్

ఏర్పాట్లు పరిశీలించిన టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: శ్రీ సీతారాముల కల్యాణం ఏర్పాట్లను టీటీడీ జేఈఓ వి వీరబ్రహ్మంతో కలిసి టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి బుధవారం పరిశీలించారు. భక్తుల రద్దీకి తగ్గట్లు జిల్లా రెవెన్యూ, పోలీసు, స్థానిక పంచాయతీ, టిటిడి అధికారులు సమిష్టిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయండి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి ఒక్కరూ కార్యదీక్షతో విధులు నిర్వర్తించి, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో జేసీ అదితిసింగ్ సింగ్‌తో కలిసి శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవ విధుల నిర్వహణపై సంబంధిత లైజన్ అధికారులకు ఒక్కరోజు శిక్షణలో భాగంగా వారికి కేటాయించిన అంశాల్లో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందన్నారు. సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మహోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 121 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 క్యూయేస్క్ లు (కౌంటర్లు) ఏర్పాటు చేశామన్నారు. కళ్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టామన్నారు. నడిచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 11 ప్రాంతాలలో షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేలా 21 ఎల్ ఈడీ స్క్రీన్ లు ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, జెడ్పి సీఈవో ఓబులమ్మ పాల్గొన్నారు.



ఆలయంలో సీఎం చేయబోయే కార్యక్రమం గురించి అర్చకులను అడుగుతున్న కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి పర్యటనపై...
ఒంటిమిట్ట: రామయ్య కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే మార్గాలను, ఉండే ప్రాంతాలను కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. అనంతరం అక్కడ విధులు నిర్వమించబోయే పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

మతసామరస్యానికి ప్రతీక.. కమలాపురం ఉరుసు

- రేపటి నుంచి ప్రారంభం కానున్న ఉరుసు మహోత్సవాలు
- 11న నషాన్, 12న గంధం, 13న ఉరుసు, 14న తహలిల్‌తో ముగింపు


హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి, స్వర్గీయ పీఠాధిపతి


ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, దర్గా ముతవల్లి


హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గా


స్వామి వారి మజార్లు

కమలాపురం : ప్రపంచంలో ఎన్నో ఆధ్యాత్మిక ప్రదేశాలు ఉన్నాయి. అన్ని ఆధ్యాత్మిక ప్రదేశాల్లో కెల్లా ఒక విశిష్ట స్థానానికి నిలయమైన ఒకే ఒక ప్రదేశం వైఎస్సార్ కడప జిల్లాలోని కమలాపురం పెద్ద దర్గా.

కమలాపురం పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా, జహీరియా మత సామరస్యానికి ప్రతీకగా, భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన ఈ దర్గాలో హజరత్ అబ్దుల్ గఫార్‌షాఖాద్రి, హజరత్ దస్తగిరిషాఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి , హజరత్ జహీరుద్దీన్ షాఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్లు వెలసి ఉన్నారు. ప్రతి ఏటా ఈ ఉరుసు మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వర్గీయ పీఠాధిపతి హజరత్ హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ఈ ఉరుసు ఉత్సవాలు నిర్వహించేవారు. ఆయన పరమ పదించిన తర్వాత ఆయన వారసులు, ముతవల్లి సజ్జాదె–ఏ–నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, వారి సోదరుల ఆధ్వర్యంలో ఈ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. 11వ తేదీన నషాన్‌తో ఉరుసు మహోత్సవాలు ప్రారంభమై, 12న గంధం, 13న ఉరుసు, 14న తహలిల్‌తో కార్యక్రమాలు ముగుస్తాయి. ఉరుసు ఉత్సవాలకు దర్గా సుందరంగా ముస్తాబు అవుతోంది. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. భక్తుల సౌకర్యార్థం ముతవల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

దర్గా విశిష్టత..

కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం నుంచి మత ప్రబోధనలు చేస్తూ వచ్చిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి 1916లో కమలాపురం వచ్చి స్థిర పడ్డారు. ఆయన తన భక్తులకు బోధనలు చేస్తూ ఎన్నో మహిమలు చూపారు. దీంతో ఈ ప్రాంతంలో చాలా మంది ఆయనకు శిష్యులుగా మారారు. ఈ నేపథ్యంలో పరిపూర్ణులై విరాజిల్లుతున్న గఫార్ షా ఖాద్రి తన ప్రియ శిష్యుడైన దస్తగిరిషా ఖాద్రికి గురుత్వం బోధించి 1924 జనవరి 10న సమాధి అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దస్తగిర్‌షా ఖాద్రి వంశీయులే పీఠాధిపతులుగా కొనసాగుతున్నారు. దాదాపు 50ఏళ్లకు పైగా పీఠాధిపతిగా కొనసాగిన హజరత్ హాజీ జహీరుద్దీన్ షా ఖాద్రి వలి అల్లాగా ప్రసిద్ధికెక్కారు. ఆయన ఇటీవల స్వర్గస్తులయ్యారు. దీంతో ఆయన కుమారుడు ఫైజుల్ గఫార్‌షా ఖాద్రి గురుతర బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మతసామరస్యానికి ప్రతీక

హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాను హిందువులే నిర్మించడంతో ఈ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హజరత్ దస్తగిర్‌షా ఖాద్రికి ముఖ్య శిష్యుడుగా ఉన్న నామా నాగయ్య శ్రేష్ఠి కుటుంబ సభ్యులు ఇప్పటికీ ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు.

గొప్ప ఖవ్వాలి..

ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకొని దర్గా ప్రాంగణంలో గంధం, ఉరుసు రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించనున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఢిల్లీకి చెందిన ఖుత్‌బీ బ్రదర్స్, యూపీకి చెందిన సర్ఫరాజ్ అన్వర్ సాబిరి ల మధ్య గొప్ప ఖవ్వాలి పోటీ జరుగుతుందని, ఖవ్వాలి ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

13న బండ లాగుడు పోటీలు..

కమలాపురం ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన దర్గా ప్రాంగణంలో పాల దంతాలు కలిగిన వృషభ రాజములచే చిన్న బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు 13వ తేదీ ఉదయం 7గంటల్లోపు దర్గా–ఏ–గఫారియా ఆఫీసులో లేదా 97011 23459, 81219 96786 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

అన్నదానం..

ఉరుసు మహోత్సవాల్లో భాగంగా నషాన్ రోజున టి.హుసేన్ మియ్యా, గంధం, ఉరుసు రోజుల్లో మోహన్ బీడి యజమాని కీ.శే. మహబూబ్ సాహెబ్ కుటుంబ సభ్యులు అన్నదానం చేయనున్నారు.

సబ్‌స్టేషన్ కోసం పేదల ఇళ్లు కూల్చివేత

- ముందస్తు నోటీసులు ఇవ్వని అధికారులు
- పరిహారం సైతం లేకుండానే స్థలం చదును
- లబోదిబోమంటున్న బాధితులు


కడప నాగరాజుపల్లె గ్రామ పొలం సర్వే నెంబరు 187/1లో ఉన్న స్థలం ఇదే

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం మృత్యుంజయకుంట సూర్య ఆస్పత్రి సమీపంలో గత 30 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా గతంలో కూలగొట్టిన విద్యుత్ అధికారులు ఇప్పుడు ఆ స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించేందుకు చదును చేస్తున్నారని బాధిత ప్రజలు వాపోతున్నారు. కడప నాగరాజుపల్లె గ్రామ పొలం సర్వే నెంబరు 187/1లో ఉన్న ఈ స్థలంలో రెవెన్యూ అధికారులు చాలాకాలం క్రితమే కొందరికి నివేశన స్థల స్వాధీన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఈ అనుబంధ పత్రాలు పొందిన పేదలు ఆ స్థలంలో చిన్నచిన్న రేకులషెడ్లు నిర్మించుకున్నారు. క్రమం తప్పకుండా మున్సిపాలిటీకి ఇంటి పన్ను, కుళాయి పన్నుతోపాటు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆధారాలన్నీ వారు చూపుతున్నారు. ఇదిలా ఉండగా ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ తమకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించుకునేందుకు స్థలం కావాలంటూ రెవెన్యూ అధికారులను కోరారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక, విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. దీంతో ప్రస్తుతమున్న పీడబ్ల్యు ఓవర్ లోడుతో పనిచేయడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. కనుక తమకు సబ్‌స్టేషన్ కోసం స్థలం కేటాయించాలని కోరగా, అప్పటి కలెక్టర్ విజయరామరాజు సదరు సర్వే నెంబరులోని 20 సెంట్ల స్థలాన్ని ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్‌కు కేటాయిస్తూ గత సంవత్సరం జులై 18న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో విద్యుత్ అధికారులు వెళ్లి దౌర్జన్యంగా ఇళ్లను కూల్చివేశారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పేదలు నిర్మించుకున్న ఇళ్లు ఎలా కూల్చివేస్తారంటూ హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై తమకు సమాధానం ఇవ్వాలంటూ ఆదేశించింది. దీంతో తాత్కాలికంగా విద్యుత్ అధికారులు వెనక్కి తగ్గారు. ఈనెల 6వ తేదీ శ్రీరామనవమి రోజు స్థలం వద్దకు వచ్చి అక్కడ పేదలు ఏర్పాటు చేసుకున్న బోర్డును తొలగించి స్థలాన్ని చదును చేశారు. దీనిపై బాధితులు ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. ఇదే సర్వే నెంబరులో తమకు కేటాయించిన 20 సెంట్ల స్థలమే కాకుండా మరో ఎకరా ప్రభుత్వ భూమి ఉందని, ఆ స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించుకుంటే తమకు అభ్యంతరం లేదని బాధితులు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమ పట్టా స్థలంలో తాము ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇరువురి అరెస్టు

24 గంటల్లోనే కేసును ఛేదించిన త్రీ టౌన్ పోలీసులు


నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు వివరిస్తున్న సీఐ గోవిందరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని హోమస్ పేటలో వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన కేసులో కొన్ని గంటల్లోనే నిందితులను త్రీ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులైన చిలంకూరి బాలయ్య, శ్రీరామ ఏసురత్నమ్మలను అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను ప్రొద్దుటూరు త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హోమస్‌పేటలో ఆయుర్వేదిక్ మందుల షాపు నిర్వహిస్తున్న ముంగర సుభాషిణి అనే వృద్ధురాలు మంగళవారం ఒంటరిగా ఉన్న సమయంలో చాపాడు మండలంలోని భద్రిపల్లెకు చెందిన చిలంకూరి బాలయ్య, ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన శ్రీరామ ఏసురత్నమ్మలు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన వెంటనే డీఎస్పీ భావన పర్యవేక్షణలో త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం సమీపంలో లభించిన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని వాసవి సర్కిల్ సమీపంలో నిందితులు ఉన్నారని సమాచారం రావడంతో సీఐతో పాటు ఎస్ఐలు యోగీంద్ర సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 29 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. బాలయ్య, ఏసురత్నమ్మలు బంధువులు అవుతారు. వీరిరువురు మరో ముగ్గురితో కలిసి 2017లో కల్లూరు గ్రామంలోని బంధువుల ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ తెలిపారు. 24 గంటల్లోనే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ యోగీంద్ర, కానిస్టేబుళ్లు దస్తగిరి, సుబ్రహ్మణ్యం, బాలఏసు, జనార్దన్‌రెడ్డి, మహిళా కానిస్టేబుల్ సుధామణిలను డీఎస్పీ భావన అభినందించారు.

ప్రమాదం కాదు.. హత్యే

- లారీతో ఢీ కొట్టి హత్య
- బంధువుల మధ్య తగాదే కారణం
- పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసిన నిజాలు


పోలీసుల అదుపులో ఉన్న వాహనం

జమ్మలమడుగు రూరల్ : బంధువుల మధ్య చిన్న తగాదే చిలికి చిలికి గాలి వానగా మారింది. అది చివరకు హత్యకు దారి తీసింది. అయితే దానిని ప్రమాదంగా చిత్రీకరించాలని బంధువులు ప్రయత్నం చేశారు. చివరకు పోలీసుల విచారణలో హత్యగా నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం కోర్టులో హాజరు పరిచారు. జమ్మలమడుగు పట్టణ సీఐ ఎస్.లింగప్ప కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బట్టు కిషోర్ బాబు (33) అనే యువకుడు మార్చి 24వ తేదీ జమ్మలమడుగు నుంచి స్వగ్రామమైన గూడెంచెరువుకు తన బైక్‌లో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా బట్టు కిషోర్ భార్య పుష్పవతి జమ్మలమడుగు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై అనుమానంతో విచారణ చేపట్టగా అసలు విషయం తెలిసింది. కిషోర్ బాబుకు అన్న వరుస అయిన దేవరపల్లి ఉదయ్ కుమార్ ప్రొద్దుటూరు పట్టణంలోని కొట్టాలలో ఉంటున్నాడు. మార్చి 20వ తేదీన తన మేన మామ అయిన కిరణ్ తల్లి చనిపోయి 11 రోజులు కావడంతో దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉదయ్ కుమార్‌ను చిన్న విషయమై కిషోర్ బాబు అందరి ముందు మందలించాడు. అంతే కాకుండా ఉదయ్ కుమార్ భార్యపై కిషోర్ బాబు చేయి చేసుకున్నాడు. దీనిని అవమానంగా భావించిన ఉదయ్ కుమార్ ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. మార్చి 23వ తేదీన తాను డ్రైవర్‌గా వెళ్లే ఏపీ39–యుకె–3392 నెంబర్ గల ఐచర్ వాహనంలో జమ్మలమడుగు బైపాస్‌రోడ్డుకు వచ్చాడు. అక్కడి నుంచి కిషోర్ బాబుకు ఫోన్ చేసి నీ కథ ఈ రోజు తేలుస్తానని బెదిరించాడు. కిషోర్ బాబు మోటార్ బైకులో పట్టణంలోని ముద్దనూరు రహదారి గుండా వెళుతుండగా ఐషర్ లారీతో వెనుక వైపు నుంచి కిషోర్ బాబు బైకును ఢీకొని వాహనంతో పరారయ్యాడు. సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించిన పోలీసులు నిందితుడు ఉదయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తానే వాహనంతో ఢీ కొట్టి చంపినట్లు అంగీకరించాడు. నిందితుడిని బుధవారం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి పటిష్ట భద్రత

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్


పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్/ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 11న శుక్రవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్న సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ తెలిపారు. రెండు వేల మందికి పైగా పోలీసులను నియమించామన్నారు. బందోబస్తు విధుల్లో నలుగురు అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 73 మంది సీఐలు, 177 మంది ఎస్ఐలు, 1700 మంది పోలీసు సిబ్బంది ఉంటారని తెలిపారు. బుధవారం కడప నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్.పి బందోబస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి, ఏ.ఆర్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.అలాగే ఒంటిమిట్ట ఆలయం వద్ద కూడా పోలీసులకు సూచనలు ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు , అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, ఏ.ఆర్. డీఎస్పీ కె.శ్రీనివాస రావు, ఎస్.బి. ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్.ఐ లు ఆనంద్, వీరేష్, శివరాముడు పాల్గొన్నారు.

రేపు కల్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒంటిమిట్ట కోదండ రామస్వామి కల్యాణోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి శుక్రవారం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 35 బస్సులు, పులివెందుల 12, బద్వేలు 22, జమ్మలమడుగు 12, మైదుకూరు 7, ప్రొద్దుటూరు 17, రాయచోటి, రాజంపేట, ఇతర డిపోల నుంచి 40 బస్సులు చొప్పున మొత్తం 145 బస్సులు నడుస్తాయన్నారు. పార్కింగ్ స్థలాల నుంచి కల్యాణోత్సవం జరిగే ప్రాంతానికి 20 బస్సులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టీటీడీ వారి సహకారంతో నడపనున్నామన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

హాకీ టోర్నీలో ద్వితీయ స్థానంలో జిల్లా జట్టు


రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ టోర్నీలో విజేతగా కాకినాడ జిల్లా జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా జట్టుతో తలపడిన కాకినాడ జట్టు ఆది నుంచి ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 2–0 గోల్స్ తేడాతో విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. క్రీడాకారులను హాకీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రవిచంద్ర, సెక్రటరీ శేఖర్, డైరెక్టర్ శ్రీనివాసులు అభినందించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్.. విజేత జట్టును అభినందిస్తూ ట్రోఫీని అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన వైఎస్సార్ జిల్లా జట్టుకు ధర్మవరం షిరిడి సాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు వీరనారాయణ, మూడో స్థానంలో నిలిచిన అన్నమయ్య జిల్లా జట్టుకు చేనేత నాయకురాలు జయశ్రీ బహుమతులు, ట్రోఫీలను అందించారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుండారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. గుండారెడ్డి కోరారు. కడపలోని హరిత హోటల్‌లో బుధవారం వైవీయూ ప్రైవేటు డిగ్రీ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ఐదు సంవత్సరాలు అఫ్లియేషన్ ఇవ్వాలని కోరారు. జీఓ నంబరు 22 రద్దుచేసి డిగ్రీ ఫీజు నిర్ణయ విధానం పాత పద్ధతిలో కొనసాగించాలన్నారు. అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాం , నాయకులు శౌరీలురెడ్డి, జి.వెంకటరెడ్డి, సురేంద్ర రెడ్డి, మహానందయ్య, సుబ్బారెడ్డి, వివిధ కళాశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

- బెట్టింగ్ నిర్వహిస్తున్న 23 మంది అరెస్టు
- రూ.3.10 లక్షలు నగదు, 23 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఆన్‌లైన్‌లో రూ. 1 కోటికి పైగా జరిగిన లావాదేవీలు
- బెట్టింగ్ కేసులో పలువురు టీడీపీ నాయకులు


క్రికెట్ బుకీల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న క్రికెట్ బెట్టింగ్ ముఠాను ప్రొద్దుటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. యాప్‌ల ద్వారా బెట్టింగ్ కొనసాగిస్తున్న ముఠా కార్యకలాపాల గుట్టు రట్టు చేశారు. రెండు వేర్వేరు కేసుల్లో 25 మందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 3.10 లక్షలు నగదు, 23 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ప్రొద్దుటూరు డీఎస్పీ భావన బుధవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభం అయిన నాటి నుంచి ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా ఉంచారు. ఇందులో భాగంగానే బుకీలకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరులోని రామేశ్వరం నీళ్లట్యాంకు వద్ద క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో 18 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 2.05 లక్షలు నగదు, 18 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పట్టుబడిన దొరసానిపల్లెకు చెందిన పుత్తాగిరీష్ అనే వ్యక్తి గతంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో బిగ్‌బబూల్ 247.కామ్ అనే వెబ్‌సైట్‌లో కొంత మంది యువకులను యాప్‌లో చేర్చుకొని పందేలు నిర్వహించేవాడు. ఇలా సుమారు 40 మంది బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి ఖాతాలను పరిశీలించగా సుమారు రూ. 1 కోటి పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరి బ్యాంక్ ఖాతాలను పరిశీలించి ఫ్రీజ్ చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పుత్తా గిరీష్‌కుమార్‌తో పాటు సాధు వీరప్రసాద్, పాతకోట ప్రతాప్‌రెడ్డి, ఆవుల సుబ్బారెడ్డి, బీచెర్ల సుబ్బారెడ్డి, వరదా సుధాకర్, మార్తల గురుశేఖర్‌రెడ్డి, మైలాగిని శివచైతన్య, సాధు పన్‌కుమార్, నల్లమారు నాగేంద్ర, వరదా ఆంజనేయులు, చిన్న కొండగిరి సుబ్బయ్య, మేకల మదనబాబు, ఎర్రమాసు ప్రతాప్, పబ్బతి శివశంకర్, తాటికొండ శ్రీను, తాటికొండ జగన్, భరతికవి చిన్నలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లె, చౌటపల్లె తదితర ప్రాంతాలకు చెందిన వారు. ఇదే కేసులో 23 మందిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

మరో కేసులో ఐదుగురు అరెస్ట్

పట్టణంలోని ఇస్లాంపురం వీధిలో క్రికెట్ పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో కోనేటి కాల్వవీధికి చెందిన షేక్ మాబుషరీఫ్ అలియాస్ చుంచు, పిందాల జనార్ధన్‌రెడ్డి, భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, వేంపల్లి సుదర్శన్‌రెడ్డి, శ్రీరామ్ సుబ్బరాయుడు ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ. 1.05 లక్షలు నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లోని 23 మంది నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

బెట్టింగ్ వ్యవహారంలో బడా బుకీల ప్రమేయం

బెట్టింగ్ వ్యవహారంలో ప్రొద్దుటూరులోని బడా బుకీలైన టీడీపీ నాయకులకు సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పలువురు టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. దొరసానిపల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ భర్త అరవ మునివర, షేక్ ఫారూక్, షేక్ గౌస్‌బాషా అలియాస్ బెంగళూరు బాషా, ప్రొద్దుటూరు మున్సిపాలిటి 25వ వార్డు కౌన్సిలర్ షేక్ హెహనూర్ భర్త ఖాదర్‌బాషాతో పాటు ఏలే నరసింహులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇస్లాంపురం వీధిలో పట్టుబడిన ఐదుగురు బుకీలు వీరి కనుసన్నల్లో క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరిపై ప్రొద్దుటూరుతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ క్రికెట్ పందేల కేసులు ఉన్నాయి. ప్రొద్దుటూరులో ప్రప్రథమంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై బీఎన్ఎస్ 111 (2), 112 (2) అనే కొత్త సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో బీఎన్ఎస్ 111 (2) సెక్షన్ అనేది తీవ్రమైందని తెలిపారు. ఈ రెండు కూడా నాన్‌బెయిలబుల్ సెక్షన్‌లని, వ్యవస్థీకృత నేరం కింద 7 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు

బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా వదలే ప్రసక్తి లేదని డీఎస్పీ తెలిపారు. వ్యవస్థీకృత నేరాల కింద కేసులు నమోదు అయితే బెయిల్ కూడా రాదన్నారు. చాలా మంది యువకులు కూడా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. యువత బెట్టింగ్ మోజులో పడి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. ప్రతి యాప్, వెబ్‌సైట్ పైనా పోలీసుల నిఘా ఉందన్నారు. ఐడీలు, ఐపీ అడ్రస్ ఆధారంగా యాప్‌లు ఎక్కడ క్రియేట్ చేశారో తెలుసుకొని సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో శ్రమించిన సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది రఘు, రామ్మోహన్‌లను డీఎస్పీ భావన అభినందించారు. రివార్డు కోసం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో సీఐలు సదాశివయ్య, గోవిందరెడ్డి, బాలమద్దిలేటి పాల్గొన్నారు.